క్లుప్తంగా

అర్ధాకలితో కార్మిక కుటుంబాలు



తాడేపల్లిరూరల్: బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు, వారి కుటుంబాలు అర్ధాకలితో అలమటిస్తున్నాయని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు అన్నారు. ఆదివారం కార్మికుల దీక్షను ఏసీసీ కార్మికుల పోరాట కన్వీనర్ కూరపాటి స్టీవెన్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ మూడు దశాబ్దాలకుపైగా అక్రమ లాకౌట్ కారణంగా చిన్నాభిన్నమైన కార్మికుల సమస్యలను పరిష్కారిస్తానని ఎన్నికల్లో మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సమస్యలను పరిష్కరించి, న్యాయం చేయాలని కోరారు. ఈ దీక్షలలో డి.నాగేశ్వరరావు, ఎం.సాంబశివరావు, ఎస్కే ఆరిఫ్, సీహెచ్ పిచ్చయ్య, బి.సూర్యప్రకాష్ దీక్షలో కూర్చున్నారు. ఏఐఎఫ్‌టీయూ నాయకులు కె. ఆదినారాయణ, అంకయ్య, నవనీతం పాల్గొన్నారు.

కార్మెల్ మాతకు పూజలు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని కార్మెల్ మాతను ఆదివారం భక్తులు సందర్శించుకున్నారు. కొండను ఎక్కి తలనీలాలు సమర్పించుకున్నారు. కొబ్బరి కాయలు కొట్టి, కొవ్వొత్తులు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. దిగువ భాగంలో ఉన్న మరియమాత విగ్రహానికి పూజలు చేశారు.

దొంతిరెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు



తాడేపల్లిరూరల్ : ప్రజల జీవితాల్లో సంక్రాంతి సుఖ సంతోషాలు నింపాలని మంగళగిరి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి (డీవీఆర్) ఆకాంక్షించారు. ప్రజలకు ఆదివారం భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపారు. సిరి సంపదలతో, భోగభాగ్యాలతో తులతూగాలని, ఇంటిల్లిపాది అంగరంగ వైభవంగా పండును జరుపుకోవాలని పేర్కొన్నారు.

నేటి నుంచి శాంతి సువార్త పండగలు



మంగళగిరి (తాడేపల్లిరూరల్): ప్రపంచ శాంతిని కోరుతూ జీసెస్ గాస్పెల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి శాంతి సువార్త పండగలు జరుగుతాయని అసోసియేషన్ అధ్యక్షుడు రెవ బిషప్ ఆర్.మోషేబాబు తెలిపారు. మంగళగిరి నగర పరిధిలోని తెనాలి బైపాస్ ఫ్లై ఓవర్ వద్ద ఉన్న ప్రాంగణంలో ఆదివారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. మోషేబాబు మాట్లాడుతూ 17వ తేదీ వరకు పండుగలు మంగళగిరి – తెనాలి ఫ్లై ఓవర్ పక్కనే ఉన్న అందే చంటి ప్లాట్స్ ప్రాంగణంలో జరుగుతాయని తెలిపారు. మంగళగిరి జేజేపీ డైరెక్టర్ రెవ.డాక్టర్ ఎస్.వసంతరావు మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి సుమారు 10 వేల మందికి పైగా విశ్వాసులు పాల్గొంటారని చెప్పారు. హాజరయ్యే వారికి వసతి, భోజనం, వాహన సదుపాయాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కులమతాలతో సంబంధం లేకుండా అందరూ ఆహ్వానితులే అని పేర్కొన్నారు. సువార్త పండుగ కరపత్రాలను ఆవిష్కరించారు.

నేటి నుంచి సంక్రాంతి సంబరాలు

తాడికొండ: రావెల గ్రామంలో వేమన కళాపరిషత్ ఆధ్వర్యంలో 8వ సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు కళాపరిషత్ అధ్యక్ష ఉపాధ్యక్షులు శ్యామల జయకోటిరెడ్డి, భీమవరపు ధర్మారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం భోగి మంటలు, చిన్నారులకు లెమన్ స్పూన్, స్లో సైక్లింగ్, మ్యూజికల్ చైర్స్, జూనియర్ కబడ్డీ, మధ్యాహ్నం రంగ వల్లులు, డ్యాన్స్, చిన్నారుల లఘు నాటికల ప్రదర్శన ఉంటుందన్నారు. 14న పలు ఆటల పోటీలు, ఇంద్ర ప్రస్థం నాటిక, 15న శివ తాండవం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్ రెడ్డితో బహుమతుల ప్రధానోత్సవం జరగనుందని తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



మంగళగిరి (తాడేపల్లిరూరల్): అనారోగ్యంతో చికిత్స పొందుతున్న మంగళగిరి పట్టణానికి చెందిన దామర్ల దుర్గా మహేశ్వరరావుకు ముఖ్య మంత్రి సహాయ నిధి నుంచి రూ.4.50లక్షల నగదు చెక్కును ఆదివారం స్థానిక టీడీపీ నాయకులు అందజేశారు. ఆదివారం దుర్గామల్లేశ్వరరావుకు అందజేశారు. చొరవ తీసుకుని స్పందించిన మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ నాయకులు దుర్గారావు, షేక్ రియాజ్, శివశంకర్, మాధవరావు, వల్లభనేని భార్గవ్ పాల్గొన్నారు.

బియ్యం మాయ!

- అధిక రేట్లకు సన్న బియ్యం విక్రయం
- పాలిష్ పట్టిన రేషన్ బియ్యం మిక్సింగ్..
- మోసపోతున్న వినియోగదారులు
- పట్టించుకోని అధికారులు



మార్కెట్‌కు తరలించడానికి సిద్ధంగా ఉన్న సన్న బియ్యం

మేడికొండూరు: మార్కెట్లో సన్న బియ్యం ధరలకు రెక్కలొచ్చాయి. కేజీ మీద రూ.10 నుంచి రూ.15లు అధికంగా వ్యాపారులు విక్రయిస్తున్నారు. బీపీటీల్లో నాణ్యత కలిగిన బియ్యం అయితే రూ.18లు అధికంగా చెబుతున్నారు. కేజీ రూ.60 నుంచి రూ.70 వరకు బియ్యం ధరలున్నాయి. 25 కేజీల బస్తా రూ.1,600 నుంచి రూ.1,800కు అమ్ముతున్నారు. ధరల మీద జీఎస్టీ ప్రభావం చూపనప్పటికీ ప్రజలకు అధిక ధరలు తప్పడం లేదు. బహిరంగ మార్కెట్లో జీఎస్టీ పేరు చెప్పి.. వియోగదారులపై భారం మోపుతున్నారు. ప్రశ్నిస్తే హోల్‌సేల్ విక్రయదారులు నిర్ణయించిన రేట్లేనంటూ మాట దాటవేస్తున్నారు.

ఎమ్మార్పీ లేకుండా విక్రయం

కొంతమంది వ్యాపారులు పాతిక కేజీల రైస్ బ్యాగ్‌ను ఎమ్మార్పీ లేకుండానే విక్రయిస్తున్నారు. తప్పనిసరిగా బస్తాపై ఎమ్మార్పీ, తయారైన తేదీ, బ్యాచ్ నంబరు ఉండాలి. మరికొంతమంది వ్యాపారులు తమ ఇష్టం వచ్చిన బ్రాండ్ల పేర్లు పెట్టుకొని ఇష్టారీతిలో విక్రయాలు సాగిస్తున్నారు.

రైస్ మిల్లుల మాయ..

కొంతమంది రైస్ మిల్లుల్లో, మార్కెట్‌లో సన్న బియ్యంలో రేషన్ బియ్యం కలిపి విక్రయిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. రేషన్ బియ్యాన్ని పాలిష్ చేసి సన్న బియ్యం ఉన్న సంచుల్లో కలయబోస్తున్నారు. వినియోగదారులు అసలు బియ్యం, కల్తీ బియ్యం తేడాను గుర్తించలేకున్నారు. ప్రస్తుతం బియ్యం విక్రయాలు లైసెన్సులు లేకుండా చేస్తున్నారు. అధిక ధరలు, కల్తీని అరికట్టాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. ఏడాదికి కనీసం ఒకసారైన అధికారులు మిల్లులు, వ్యాపార సంస్థల్లో తనిఖీలు నిర్వహిస్తే.. ఈ దందాకు అడ్డుకట్ట పడుతుంది.

నాణ్యత తెలియడం లేదు..



ఎక్కువ ధర పెట్టి కొన్నా .. బియ్యం నాణ్యత తెలియడం లేదు. ఒకసారి కొన్న బ్రాండు రెండోసారి కొంటే వండినప్పుడు తేడా వస్తోంది. అన్నం సరిగా ఉడక్కపోవడం.. లేదంటే జిగటగా తయారవడం జరుగుతోంది. అనేక బ్రాండ్లతో దుకాణదారులు.. పలు రకాల రేట్లు చెప్పినా.. చివరకు వచ్చే సరికి బియ్యం పరిస్థితి మారిపోతుంది.

– నర్రా రమాదేవి, గృహిణి, మేడికొండూరు

బాధితులకు అండగా నిలుస్తా

తాడికొండ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు



మాట్లాడుతున్న వనమా బాల వజ్రబాబు

ఫిరంగిపురం: పొనుగుపాడు గ్రామం ఎస్సీ కాలనీ వద్ద చర్చి సమీపంలోని గోడను అక్రమంగా టీడీపీ నాయకులు కూల్చడం అన్యాయమని తాడికొండ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు అన్నారు. బాధితులకు అండగా పార్టీ ఉంటామని స్పష్టం చేశారు. బాధితులను పరామర్శించేందుకు బయలుదేరిన ఆయన్ని సొలస బస్టాండు సెంటర్‌లో సీఐ రవీంద్రబాబు అడ్డుకున్నారు. శాంతిభద్రతల దృష్ట్యా అక్కడికి వెళ్లొద్దని చెప్పారు. బాల వజ్రబాబు విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నాయకులు అధికారాన్ని అడ్డుపెట్టుకొని చర్చి వద్దనున్న గోడను కూల్చివేశారన్నారు. మత సంబంధం వంటి విషయాల్లో ప్రభుత్వం జోక్యం చేసుకోవడం సరికాదన్నారు. ప్రజల వద్దకు వెళ్లేందుకు ప్రయత్నిస్తుంటే పోలీసులు అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు. 16న పొనుగుపాడు గ్రామానికి వెళ్లి బాధితులను పరామర్శిస్తానన్నారు. అనంతరం సీఐ రవీంద్రబాబుతో మాట్లాడారు. గ్రామంలో శాంతిభద్రతలకు ఆటంకం లేకుండా చూడాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, పార్టీ మండలాధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, కొమ్మారెడ్డి చిన్నప్పరెడ్డి, చిట్టా అంజిరెడ్డి, పాలపాటి రఘు, బద్దూరి శ్రీనివాసరెడ్డి, గేరా కోటేశ్వరరావు, సేవా నాగరాజు, పి.చిన్న, డి. మెల్కియా, టి.కృష్ణ, చేవూరి రామమోహన్‌రెడ్డి, పి.జోసఫ్‌కుమార్, అబ్దుల్లా, బి.అంజిరెడ్డి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



1983-84 బ్యాచ్ విద్యార్థులు

మంగళగిరి (తాడేపల్లిరూరల్): పూర్వ విద్యార్థులు 30 ఏళ్ల తర్వాత ఆత్మీయ సమ్మేళనంతో మళ్లీ ఒక్కటయ్యారు. మంగళగిరి మండల పరిధిలోని రేవేంద్రపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1983–84లో 10వ తరగతి చదువుకున్న విద్యార్థుల సమ్మేళనం పెదవడ్లపూడి డీబీఎన్ గార్డెన్స్‌లో ఆదివారం జరిగింది. 100 మంది పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. గతించిన స్నేహితుల కోసం రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం వివిధ ఆటల పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఏకపాత్రాభినయం, సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పూర్వ విద్యార్థులు భావన శ్రీనివాసరావు, లోకం దుర్గారావు, ముత్తవరపు హైమావతి, మన్నవ అప్పారావు, గిరిజ, ప్రియతం, ఉల్లంగి శ్రీనివాసరావు, కుంచకర్ల దుర్గారావు, బి.స్టాలిన్, రాజారావు, అవల్దార్ పాల్గొన్నారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి



స్వామి వివేకానంద విగ్రహం వద్ద అసోసియేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు



వివేకానందుని చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏబీవీపీ సభ్యులు

తాడేపల్లిరూరల్: స్వామి వివేకానంద 162వ జయంతిని దుగ్గిరాల మండలం ఈమని గ్రామంలో శ్రీ వివేకానంద అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. వివేకానందుడి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ నేటి యువతకు స్వామి వివేకానంద బోధనలు స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం సభ్యులందరికీ మిఠాయిలు, చాక్లెట్లు పంపిణీ చేశారు. ఎంఈఓ కాజా లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు కూరగాని ప్రకాషరావు, రాచకొండ హేమకిరణ్, ఎస్.రమేష్, అసోసియేషన్ సభ్యులు కొల్లిపర సుబ్బారావు, ఇంగువ వెంకటలక్ష్మి, కొల్లిపర అబ్బారావు, చుక్కా ప్రసాద్, పసుపులేటి శ్రీనివాసరావు,కృష్ణ పాల్గొన్నారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో మంగళగిరి నగర పరిధిలోని వడ్డపూడి సెంటర్‌లో వివేకానంద జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జూదాలకు దూరంగా ఉండండి

తాడేపల్లిరూరల్ : సంక్రాంతి పండుగ సందర్భంగా జూదాలకు దూరంగా ఉండి బాధ్యతతో వ్యవహరించాలని తాడేపల్లి తహసీల్దార్ సీతారామయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యాయస్థానాలు, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాల మేరకు తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలో ఎక్కడా కోడి పందేలు, బెట్టింగులు, ఇతర జూదాలు నిర్వహించవద్దని స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో ఏం జరుగుతుందో వీఆర్‌వోలు, వీఆర్‌ఏలు ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలని కోరారు.

దళితుల జీవన స్థితిగతులపై సర్వే



సర్వే నిర్వహిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని మంచికలపూడి గ్రామంలో ఆదివారం దళితుల జీవన స్థితిగతులు, ఆర్థిక పరిస్థితులపై వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు జెట్టి బాలరాజు మాట్లాడుతూ గ్రామంలో ఉపాధి హామీ పనులు వారం రోజుల కంటే ఎక్కువగా జరగడం లేదని అన్నారు. వేతనాలు నెలలు గడుస్తున్నా చెల్లించడం లేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం తల్లికి వందనం, అన్నదాన సుఖీభవ పథకాలు అమలు చేయడం లేదని దీని వల్ల పిల్లల స్కూలు ఫీజులు చెల్లించకపోవడంతో పాఠశాల యాజమాన్యాలు విద్యార్థులను బయట నిలబెడుతున్నారని తెలిపారు. సంఘం సభ్యులు స్టాలిన్, బ్రహ్మేశ్వరరావు, ప్రకాష్‌రావు, సునీల్, ఎలమందయ్య, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్ల జోరు



విక్రయానికి సిద్ధంగా చెరకు గడలు

మంగళగిరి (తాడేపల్లిరూరల్) : సంక్రాంతి పండగ కొనుగోళ్ల హడావుడి మంగళగిరి పట్టణంలో ఆదివారం కనిపించింది. చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలు నగరానికి వస్తున్నారు. చిన్నారులకు భోగి పళ్లు పోసేందుకు భోగి పళ్లు, ముగ్గుల్లో వేయడానికి రంగులు, చెరకు గడలు, గాలి పటాలు ఇతర సామగ్రిని వ్యాపారులు అందుబాటులో ఉంచారు. పండగ సరుకులు, గుమ్మడి కాయలు కొనుగోలు చేశారు.

పతంగుల పండగొచ్చేసింది..



గాలిపటాలు కొనుగోలు చేస్తున్న చిన్నారులు



సీతాకోక చిలుక పతంగి

మంగళగిరి (తాడేపల్లిరూరల్): పిల్లల్లో సంక్రాంతి పండగ ఉత్సాహం కనిపిస్తోంది. పండగ సెలవుల్లో దారం తెగిన గాలి పటాల్లా వారిని ఆనందాన్ని ఎవరూ పట్టలేకున్నారు. ముఖ్యంగా కనుమ రోజు పతంగులు ఎగుర వేసేందుకు దుకాణాల చుట్టూ తిరుగుతున్నారు. వీరి కోసం వ్యాపారులు మార్కెట్‌లో 50 రకాల ఆకర్షణీయమైన రంగులు, బొమ్మలతో గాలిపటాలను అందుబాటులో ఉంచారు. రూ.10 నుంచి రూ.100లకు సైజు, డిజైన్ బట్టి విక్రయిస్తున్నారు. మంగళగిరి మెయిన్ బజార్‌లోని ఫ్యాన్సీ స్టోర్లలో పతంగులను విక్రయిస్తున్నారు. వీటిలో బాహుబలి గాలిపటాలు మూడేళ్లుగా కొనసాగుతున్నాయి. ఈ ఏడాది ప్రత్యేకంగా శ్రీరాముడు, అయోధ్య బాలరాముడు, స్పైడర్ మ్యాన్, జీరోమెన్, పక్షులు, జూనియర్ ఎన్టీఆర్, కల్కి సినిమా బొమ్మలతో గాలిపటాలు లభిస్తున్నాయి. గాలిపటాలను ఎగుర వేసేందుకు రెండు మూడు రకాల దారం ఉండలు అందుబాటులో ఉంచారు.

వివేకానందుని జీవితం స్ఫూర్తిదాయకం



తాడికొండ: వివేకానందుని జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని నేటి యువత ముందుకు నడవాలని రైతు సంఘం నాయకులు చింతల భాస్కరరావు అన్నారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని ఆదివారం తాడికొండ మహిళా గ్రంథాలయంలో నిర్వహించిన వేడుకలలో చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్వామి వివేకానంద తన బోధనలతో లక్షలాది మంది యువకులను ప్రేరేపించారన్నారు. గ్రంథాలయాధికారి ఎ.నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న జొన్న శివశంకరరావు

తాడేపల్లిరూరల్ : రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలై ఈ నెల 17న రైతు సంఘం ఆధ్వర్యంలో విజయవాడ ధర్నా చౌక్‌లో నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్న శివశంకరరావు పిలుపునిచ్చారు. ఆదివారం దుగ్గిరాల ప్రజా సంఘాల కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి రైతు సంఘం నాయకుడు ఎస్. యోగీశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి శివశంకరరావు మాట్లాడుతూ రైతులకు అన్నదాన సుఖీభవ పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ఇప్పటి వరకు పెట్టుబడి సాయం అందజేయలేదన్నారు. పలు డిమాండ్లతో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. సంఘం మండల కార్యదర్శి వై. బ్రహ్మేశ్వరరావు, అమ్మిరెడ్డి గోపిరెడ్డి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలు



బహుమతి అందజేస్తున్న నాయకులు

తాడేపల్లిరూరల్ : సంక్రాంతి పండగ సందర్భంగా తాడేపల్లి పట్టణం మహానాడు 1వ రోడ్డులో జనసేన పట్టణ అధ్యక్షుడు అంబటి తిరుపతిరావు ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏపీఎంఎస్ అండ్ ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు పాల్గొని పోటీలను ప్రారంభించారు. పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు ప్రదానం చేశారు. జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి బడే కోమలి, రాష్ట్ర ఐటీ విభాగం కో–ఆర్డినేటర్ చవ్వాకుల కోటేష్‌బాబు, ఎంటీఎంసీ అధ్యక్షుడు మునగపాటి వెంకట మారుతీరావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ముగ్గుల పోటీలు

మంగళగిరి (తాడేపల్లిరూరల్): సంక్రాంతి పండుగ సందర్భంగా మంగళగిరి బాపనయ్య నగర్‌లో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. స్నేహ మహిళా మండలి అధ్యక్షురాలు వల్లభనేని వాణి, డాక్టర్ పి.గిరిజ జడ్జిలుగా వ్యవహరించారు. సుమారు 82 మంది మహిళలు పాల్గొని, రంగవల్లులు తీర్చిద్దారు. విజేతకు బహుమతి ప్రదానం చేశారు. టీడీపీ నాయకులు కరుణ కుమార్, కోలా శ్రీనివాసరావు, నాగమణి, మాధవి, మాజీ కౌన్సిలర్లు కొమ్మారెడ్డి నాని పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే

తాడికొండ: మోతడక గ్రామంలో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ ఆదివారం ప్రారంభించారు. రూ.10 లక్షల మండల పరిషత్ నిధులతో నిర్మించిన బస్ షెల్టర్, రూ.15 లక్షల ఉపాధి నిధులతో నిర్మించిన సీసీ రోడ్లు, రూ.40 లక్షల ఉపాధి నిధులతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ. 17.50 లక్షల ఉపాధి హామీ, హెచ్‌డబ్లుసి నిధులతో నిర్మించిన ఆసుపత్రి, రూ.6 లక్షల పంచాయతీ నిధులతో నిర్మించిన వ్యవసాయ గోదాములను ఎమ్మెల్యే రిబ్బన్ కత్తిరించిప్రారంభించారు. సర్పంచ్ యడ్లపల్లి పార్వతీ, ఎంపీడీవో కె సమతావాణి, తహసీల్దారు కె నాసరయ్య, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

క్రీడలు మానసికోల్లాసానికి దోహదం



బహుమతులు ప్రదానం చేస్తున్న ఉండవల్లి శ్రీదేవి, చిల్లపల్లి శ్రీనివాసరావు

తాడేపల్లిరూరల్ : క్రీడలు శారీరక ధారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్ పర్సన్ ఉండవల్లి శ్రీదేవి, ఏపీ ఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లి దేవుని మాన్యంలో జరుగుతున్న క్రికెట్ పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. గత ఆరురోజులుగా సాగుతున్న తాడేపల్లి సూపర్‌లీగ్ టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. చివరిరోజు ఫైనల్ మ్యాచ్‌లో నరసింహ సీసీ, ఫ్యాక్టరీ సీసీ జట్లు తలపడగా నరసింహ సీసీ జట్టు విజేతగానిలిచింది. తాడేపల్లి పట్టణ టీడీపీ అధ్యక్షులు వల్లభనేని వెంకటరావు, మండల కార్యదర్శి కొల్లి శేషు, జనసేన రాష్ట్ర కార్యదర్శి అమ్మిశెట్టి వాసు, జనసేన నాయకులు గంజిచిరంజీవి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి సమష్టి కృషి

సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు

పాములపాడు(తాడికొండ): వైఎస్సార్ సీపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని తాడికొండ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు(డైమండ్ బాబు) అన్నారు. ఆదివారం పాములపాడు గ్రామంలో నిర్వహించిన నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులపై వివక్ష కొనసాగుతోందని, పలుచోట్ల తప్పుడు కేసులు, దాడులు చేయడంతో పాటు అధికారం అడ్డుపెట్టుకొని దౌర్జన్యాలకు దిగుతుండటం పరిపాటిగా మారిందన్నారు. పార్టీని నమ్ముకున్న కార్యకర్త, నాయకుడికి చిన్న కష్టం కలిగినా వెన్నంటి ఉండి నడుస్తానని సమస్య ఎంతటిదైనా తన దృష్టికి తీసుకొని వస్తే చట్టబద్ధంగా దానిపై పోరాటం చేసి హక్కులు కాపాడుకుందామన్నారు. ప్రతి కార్యకర్తను ఆప్యాయంగా పలకరించి గ్రామంలో పార్టీ పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. త్వరలో గ్రామ, మండల కమిటీల నియామకాలు ఉన్నాయని, అందరి ఏకాభిప్రాయంతో పదవుల ఎంపిక జరుగుతాయన్నారు. బండారుపల్లి, పాములపాడు సర్పంచ్‌లు ముప్పాళ్ల మనోహర్, బిక్కి శివరామకృష్ణ, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ దాసరి రాజు, నల్లిబోయిన శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు వడ్లమూడి రాజేంద్ర ప్రసాద్, చిన్నప్ప, కమలాకర్, కిషోర్, సుందరరావు, శ్యామ్, మాజీ ఎంపీటీసీ వల్లభాపురపు మరియదాసు పాల్గొన్నారు.

ఎన్నారైలో ముగిసిన సంక్రాంతి సంబరాలు



కోలాటం ఆడుతున్న అధ్యాపకులు

మేడికొండూరు: ఎన్ఆర్ఐ ఇంజినీరింగ్ కళాశాలలో మూడు రోజుల సంక్రాంతి ముందస్తు సంబరాలు ఆదివారంతో ముగిశాయి. కళాశాల ప్రిన్సిపల్ కోటా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఈ ఏడాది సంబరాలకు ముఖ్య అతిథిగా ప్రముఖ పారిశ్రామికవేత్త శరత్ విచ్చేశారని తెలిపారు. కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్.పి తిలక్ బాబు మాట్లాడుతూ కళాశాలలో ఏటా సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. అధ్యాపకులు పిల్లలకు భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీహరిరావు, ఏవో సీతారాం పాల్గొన్నారు.